క్లుప్తంగా

సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్‌గా పరిటాల



ఆత్మకూరు: పట్టణంలోని సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్‌గా ఆత్మకూరుకు చెందిన పరిటాల సత్యనారాయణను ప్రభుత్వం నియమించినట్లుగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా రైతులకు అందుబాటులో ఉండి వారికి రుణాలు, ఎరువులు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పరిటాల పేర్కొన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన మంత్రి ఆనం , తాళ్లూరి గిరి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వీఆర్‌ఏలకు పేస్కేల్‌ను అమలు చేయాలి



చేజర్ల(సోమశిల): వీఆర్‌ఏలకు పేస్కేల్‌ను అమలు చేసి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. చేజర్ల మండల వీఆర్‌ఏల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల గౌరవాధ్యక్షుడిగా మీరాసాహెబ్, అధ్యక్షుడిగా వెంకటేష్, ఉపాధ్యక్షురాలిగా అరుణమ్మను ఎంపిక చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, సహాయ కార్యదర్శి బాలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సత్కారం



సంగం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్యను ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించారు. జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం ట్రెజరర్‌గా ఎన్నికవడంపై అభినందించారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ పద్ధతిలో డ్రైవర్లుగా పనిచేయుటకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎం ఎం శివకేశవ్‌యాదవ్ సోమవారం తెలిపారు. 20 మందికి అవకాశం ఉందన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి 39 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులని చెప్పారు. అర్హులైన వారు ఆర్టీసీ డిపో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భూసేకరణపై గ్రామసభ



కలిగిరి: మండలంలోని పెద్దకొండూరు పంచాయతీ కార్యాలయంలో పారిశ్రామికవాడకు భూసేకరణపై తహసీల్దార్ ఎం గిరీష్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే నంబర్ 739లోని 606.05 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించేందుకు గ్రామసభ నిర్వహించగా ప్రజలు ఆమోదిస్తూ తీర్మానం చేశారన్నారు. స్థానికులకు పారిశ్రామికవాడలో ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు విజ్ఞప్తి చేశారని తెలిపారు. సర్పంచ్ మొక్కా సుజాత పాల్గొన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ. 221

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు సగటు ధర రూ.221 ధర పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 299 బేళ్లను తీసుకురాగా, 162 బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.150, సగటున రూ. 221.76 ధర పలికిందని వివరించారు.

డీసీపల్లిలో 291 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 291 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 548 బేళ్లు రాగా, 291 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.140, సగటున 194.93 ధరగా పలికిందని వివరించారు.

తమిళనాడు బోట్లపై చర్యలకు వినతి

కావలి (జలదంకి): ఆంధ్రప్రదేశ్ తీరంలోకి అక్రమంగా ప్రవేశించి చేపల వేట సాగిస్తున్న తమిళనాడులోని కడలూరు, కారైకల్‌కు చెందిన బోట్లపై చర్యలు తీసుకోవాలని బీసీ ఐక్యత భవన్ రాష్ట్రాధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓ వంశీకృష్ణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలో చేపల వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే మన తీరంలోకి తమిళనాడుకు చెందిన బోట్లు అక్రమంగా ప్రవేశించి వేట సాగిస్తుండడంతో మత్స్యకారుల జీవనోపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రీనరీ పేరుతో ప్రజాధనం దోపిడీ

- డివైడర్ల మధ్యన గ్రీనరీకి రూ.40లక్షలు ఖర్చు
- కుమ్మక్కైన అధికారులు, నాయకులు
- టెండర్లు పిలవకుండానే నామినేషన్‌పై పనులు అప్పగింత
- అరకొరగా మొక్కలు నాటి భారీగా నిధులు స్వాహా



ఆత్మకూరు-నెల్లూరుపాళెం మధ్యన డివైడర్‌లో అరకొరగా నాటిన మొక్కలు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం సెంటర్ నుంచి పాత ఎల్‌ఐసీ కార్యాలయం వరకు గత ప్రభుత్వ కాలంలో డివైడర్లు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు.అప్పట్లో డివైడర్ల మధ్యన రకరకాల మొక్కలు నాటారు. అయితే కొంత కాలానికి మొక్కలు కొంత మేర దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటీవల డివైడర్ల మధ్యలో వివిధ రకాల మొక్కలు నాటారు. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించారు. గ్రీనరీని చూసిన పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అయితే ఈ గ్రీనరీ పేరుతో లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని స్వాహా చేసినట్లుగా తెలుసుకున్న ప్రజలు మండిపడుతున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో డివైడర్ల మధ్యలో గ్రీనరీ అభివృద్ధికి రూ.40 లక్షలు ఖర్చు చేసినట్లుగా చూపి బిల్లులకు ఆమోదం పొందారు. గ్రీనరీకి చేసిన ఖర్చు వెలుగులోకి రావడంతో పట్టణ ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కేవలం రెండు కిలోమీటర్ల పరిధిలో గ్రీనరీకి రూ.40 లక్షలు ఖర్చు చేయడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు కుమ్మక్కై టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిలో పనులు కట్టబెట్టి రూ.10లక్షలు కూడా ఖర్చు కాని గ్రీనరీకి ఏకంగా రూ.40లక్షలు ఖర్చు చేసినట్లుగా లెక్కలు చూపించి ప్రజాధనాన్ని స్వాహా చేయడంపై మండిపడుతున్నారు.

నామినేషన్ పద్ధతిలో పనులు కట్టబెట్టి..

గతంలోనే నెల్లూరుపాళెం సెంటర్ నుంచి పాత ఎల్‌ఐసీ కార్యాలయం వరకు డివైడర్లను నిర్మించి గ్రీనరీని ఏర్పాటు చేశారు. అందులోని దెబ్బతిన్న పాత మొక్కలను తొలగించి కొంత మట్టిని తీసి వేసి కొత్తగా మట్టి తోలారు. పెద్ద మొక్కలు 240 నాటారు. మిగిలినవన్నీ పూల మొక్కలే. సరాసరిన వీటి కొనుగోలు లెక్కించినా లక్ష రూపాయలు కూడా విలువ చేయవు. డ్రిప్ ద్వారా మొక్కలకు నీటి సౌకర్యం కల్పించడానికి రూ.2 లక్షలు నుంచి రూ.3 లక్షలు ఖర్చు చేసి ఉంటారని అంచనా. పాత మట్టిని తొలగించి కొత్తగా ఎరువు, మట్టి తోలకానికి మరో రూ.2 లక్షలు ఖర్చయ్యి ఉంటుందని అంచనా. ఇలా మొత్తం కలిపినా సుమారు రూ.10 లక్షలు కూడా ఖర్చయ్యి ఉండదు. అయితే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదించిన పత్రాలను పరిశీలిస్తే నెల్లూరుపాళెం సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ వరకు సెంట్రల్ డివైడర్ సుందరీకరణ పనులకు రూ.5 లక్షలు, ఫైర్‌స్టేషన్ నుంచి ఏఎంసీ కార్యాలయం వరకు రూ.5 లక్షలు, అక్కడి నుంచి నాగులపాడు అడ్డరోడ్డు వరకు రూ.5 లక్షలు..ఇలా మొత్తం 8 విభాగాలుగా పాత ఎల్‌ఐసీ కార్యాలయం వరకు రూ.40 లక్షలు గ్రీనరీకి ఖర్చు చేసినట్లుగా చూపారు. టెండర్లు పిలిచి గ్రీనరీ పనులను అప్పగించే అవకాశం ఉన్నా 8 విభాగాలుగా విభజించి నామినేషన్ పద్ధతిపై పనులను కట్టబెట్టారు. అధికారులు, టీడీపీ నాయకులు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోపిడీ చేసేందుకు ఇలా పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రీనరీ పనుల్లో అవినీతిపై సాక్షాత్తు టీడీపీకి చెందిన కౌన్సిలరే కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తడం విశేషం. పలువురు కౌన్సిలర్లు గ్రీనరీ పనులపై నిలదీసినా దాటవేత ధోరణిలో పాలకపక్ష కౌన్సిలర్లు, అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం.

నిధులు దుర్వినియోగం



పట్టణంలోని డివైడర్లను సుందరీకరణ చేయడం అభినందనీయమే. అయితే సుందరీకరణ పేరుతో రూ.10లక్షలు కూడా ఖర్చవని గ్రీనరీ పనులకు రూ.40లక్షలు ఖర్చు చేసినట్లుగా చూపి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదు. ఉన్నతాధికారులు పరిశీలిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి. భవిష్యత్‌లో ఇలా ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– కొండా స్వరూప, కౌన్సిలర్, ఆత్మకూరు

ఎంఈఓ-2గా ప్రవీణ



సీతారామపురం : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ప్రవీణ ఎంఈఓ-2గా నియమితులయ్యారు. సోమవారం ఆమె మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఈఓ-2గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఎంఈఓ షేక్.మస్తాన్‌వలి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

లైంగికదాడి కేసుపై డీఎస్పీ విచారణ

సంగం: మండలంలోని కోరిమెర్లలో లైంగిక దాడి, అట్రాసిటీ కేసులపై ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్ సోమవారం విచారణ చేపట్టారు. కోరిమెర్లలోని మామిడి తోటలో పనిచేస్తున్న తనపై తోట యజమాని యూసఫ్ తన స్నేహితులతో కలిసి మద్యం సేవించి లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధిత గిరిజన మహిళ సంగం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఈ నెల 6వ తేదీ యూసఫ్‌పై పోలీసులు అట్రాసిటీ, లైంగికదాడి కేసులను నమోదు చేశారు. ఈ మేరకు ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ మామిడితోటలో గిరిజన మహిళను విచారించారు. ఈ సందర్భంగా పలు ఆసక్తికర ఘటనలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఆయన వెంట ఎస్సై రాజేష్ ఉన్నారు.

అక్రమ చేపల గుంతల పరిశీలన



చేపల గుంతలను పరిశీలిస్తున్న జేసీ

ఆత్మకూరు: చేజర్ల మండలం కోటితీర్థంలో అనుమతుల్లేకుండా సాగు చేస్తున్న అక్రమ చేపల గుంతలను జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, ఇతర అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కోటితీర్థంలో కొందరు అక్రమంగా చేపలు గుంతలను సాగుచేస్తుండడంతో సమీపంలోని పొలాలు ఊటెక్కి వరి పంట పండక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై రైతులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా అధికారులు స్పందించలేదు. ఇటీవల 'సాక్షి'లో 'అడ్డగోలుగా చేపల చెరువుల సాగు' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో బాధిత రైతులు జేసీ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జేసీ స్వయంగా చేపల గుంతలను పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపల గుంతలను సాగుచేస్తున్నా పట్టించుకోకపోవడంపై మత్స్యశాఖ అధికారులను మందలించారు. విద్యుత్‌శాఖ అధికారులు మోటార్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం సరికాదన్నారు. ఈ విషయమై సమగ్ర నివేదికను తనకు వెంటనే అందజేయాలని ఆర్డీఓను ఆదేశించారు. త్వరలోనే అక్రమ చేపల గుంతలపై సరైన చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారని బాధిత రైతులు పేర్కొన్నారు.

సీసీరోడ్ల నిర్మాణానికి రూ.17.16కోట్లు మంజూరు



మాట్లాడుతున్న డీఈఈ మణికుమార్

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.17.16 కోట్లు మంజూరు చేసిందని పంచాయతీ రాజ్ డీఈఈ మణికుమార్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చొరవతో పల్లె పండగలో భాగంగా రెండో విడతగా నిధులు మంజూరు చేసిందని చెప్పారు. ఉదయగిరి మండలంలో 23 పనులకు రూ.2.12 కోట్లు, సీతారామపురంలో 19 పనులకు రూ.1.47 కోట్లు, జలదంకిలో 21 పనులకు రూ.2 కోట్లు, దుత్తలూరులో 24 పనులకు రూ.2.01 కోట్లు, కలిగిరిలో 16 పనులకు రూ.2.12 కోట్లు, కొండాపురంలో 31 పనులకు రూ.2.01 కోట్లు, వింజమూరులో 25 పనులకు రూ.1.80కోట్లు, వరికుంటపాడులో 26 పనులకు రూ.3.63 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. అలాగే ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, జలదంకి మండలాల్లో బస్సుషెల్టర్లు, మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.1.05 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఈ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్లు



రాజశేఖర్

మర్రిపాడు: పొగాకు బ్యారెన్ల రిజిస్ట్రేషన్లు ఈ నెల 18 నుంచి ప్రారంభమవుతాయని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి రాజశేఖర్ సోమవారం తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా అక్టోబర్ 27 వరకు, రూ.100 అపరాధ రుసుంతో నవంబర్ 7 వరకు, రూ.400 అపరాధ రుసుంతో నవంబర్ 19 వరకు రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. 2025-26లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే మూడేళ్ల పాటు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ ఏడాది రిజిస్ట్రేషన్ రెన్యూవల్ చేసుకున్న బ్యారన్లకు సంబంధించి 2027-28 పంట కాలం వరకు అనుమతి ఉంటుందని చెప్పారు. బ్యారెన్ బదిలీలు ఉండవని, లీజు అగ్రిమెంట్లు కూడా మూడేళ్ల వరకు చేయించుకోవాలని తెలిపారు. రైతులకు ఎఫ్‌సీవీ పొగాకు విత్తనాలను కందుకూరులోని ఎస్‌ఐఆర్‌సీఏలో అందజేస్తున్నట్లు చెప్పారు. పొగాకు నారు పోసి విక్రయించే రైతులు కూడా పొగాకు బోర్డులో తప్పనసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పొగాకు నారును బ్యారెన్ ఉన్న రైతులకు మాత్రమే విక్రయించాలన్నారు. అందుకు సంబంధించి పొగాకు బోర్డు అధికారులు తనిఖీలు చేస్తారని తెలిపారు. 2025-26 పంటకాలానికి సంబంధించి దక్షిణ తేలిక నేలల్లో పొగాకు సాగుచేసే రైతులకు ఒక బ్యారెన్‌కు 2.90 హెక్టర్ల(7.25 ఎకరాలు)లో 3,665 కిలోలు పండించడానికి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పొగాకు సాగు చేపట్టాలని కోరారు.

వేతనాల కోసం వీఆర్‌ఏల నిరసన



నిరసన తెలుపుతున్న వీఆర్‌ఏలు

మర్రిపాడు: వీఆర్‌ఏలకు వేతనాలను వెంటనే అందజేయాలని సీఐటీయూ నాయకుడు బత్తల రత్నయ్య డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేతనాల కోసం వీఆర్‌ఏలు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రత్నయ్య మాట్లాడుతూ మండలంలోని వీఆర్‌ఏలు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను ప్రశ్నించగా సీనియర్ అసిస్టెంట్ లేని కారణంగా మీకోడ్ ఇన్‌యాక్టివ్ అయి వేతనాలు అందడం లేదని సమాధానం చెబుతున్నారన్నారు. జూనియర్ అసిస్టెంట్ బదిలీపై వెళితే మరొకరితోనైనా కోడ్ పెట్టించి జీతాలు అందించాల్సిన బాధ్యత తహసీల్దార్‌పై ఉందన్నారు. తహసీల్దార్ వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ధర్నా చేపడుతామని హెచ్చరించారు. వీఆర్‌ఏల మండల కార్యదర్శి ఓబులేసు, సుబ్బారావు, నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు రక్తహీనతను అధిగమించాలి



కావలి (జలదంకి): గర్భిణులు, బాలింతలు రక్తహీనతను అధిగమించేందుకు పోషకాహారం తీసుకోవాలని వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి మహేష్ సూచించారు. వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్‌లో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష పథకంలో భాగంగా డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. రామ్‌సెంటర్ నిర్వాహకులు గర్భిణులు, బాలింతలకు ఐరన్, కాల్షియం సిరప్‌లు పంపిణీ చేశారు. రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

ఉదయగిరి రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు నులి పురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలను వైద్యాఆరోగ్య సిబ్బంది మంగళవారం ఇవ్వనున్నట్లు వైద్యాధికారిణి ఎం శివకల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నిప్రభుత్వ పాఠశాలలు 53, అంగన్‌వాడీ కేంద్రాలు 57, ప్రైవేట్ పాఠశాలలు 8, కళాశాలలు 7 ఉన్నాయని చెప్పారు. వాటిలో 1 నుంచి 19 ఏళ్లలోపు వయస్సు కలిగిన విద్యార్థులు 6,642 మంది ఉన్నారని తెలిపారు. వీరికి మధ్యాహ్న భోజనం తరువాత ఆల్బెండాజోల్ మాత్రలను మింగించనున్నట్లు వివరించారు.

వర్క్‌షాపులోకి దూసుకెళ్లిన ఇసుక టిప్పర్



వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో ఆగిఉన్న టిప్పర్‌ను సోమవారం ఇసుక లోడుతో వస్తున్న మరో టిప్పరు అదుపుతప్పి ఢీకొంది. ఈ క్రమంలో ఇసుక టిప్పర్ పక్కనే ఉన్న వర్క్‌షాపులోకి దూసుకెళ్లింది. అయితే వర్క్‌షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో రెండు టిప్పర్లు దెబ్బతిన్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌ఏల నూతన కార్యవర్గ ఎన్నిక



సోమశిల: అనంతసాగరం మండల వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్నుపాటి లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో మండల గౌరవాధ్యక్షుడిగా అన్వర్‌బాషా, మండలాధ్యక్షుడిగా వెంకటకృష్ణ, కార్యదర్శిగా రవి, ట్రెజరర్‌గా మొహిద్దీన్, ఉపాధ్యక్షులుగా అశోక్, సహాయ కార్యదర్శిగా పెంచలయ్యను ఎన్నుకున్నారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎన్‌ఎంయూఏ ధర్నా

ఉదయగిరి రూరల్: ఏపీపీటీడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఉదయగిరి డిపో ఎదుట మంగళ, బుధవారాల్లో ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆ సంఘ నాయకులు సోమవారం తెలిపారు. ఎన్‌ఎంయూఏ ఉద్యోగుల ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ముమ్మరంగా ఆర్టీసీ బస్టాండ్ పనులు

అల్లూరు: నెల్లూరు రీజియన్ ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆదేశాల మేరకు అల్లూరులో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చే పనులను ప్రారంభించారు. సోమవారం బస్టాండ్ ఆవరణంలో జంగిల్‌క్లియరెన్స్ పనులను చేపట్టారు. ఈ పనులను కూటమి నాయకులు పరిశీలించారు. బస్టాండ్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లుగా వారు తెలిపారు. సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ కమిటీల నియామకం



గడ్డం వెంకటేశ్వర్లు

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నూతన కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీచేసింది. ప్రతిసొసైటీకి చైర్మన్‌తో పాటు ఇద్దరు సభ్యులను నియమించారు. వీరు జనవరి 30వ తేదీ వరకు పదవిలో కొనసాగుతారు. వరికుంటపాడు సొసైటీ అధ్యక్షుడిగా గుర్రం గోపి, సభ్యులుగా మానం కొండలరావు, మేడిద వెంకటేశ్వర్లును నియమించారు. వింజమూరు సొసైటీ అధ్యక్షుడిగా చల్లా వెంకటేశ్వర్లు, సభ్యులుగా గని శ్రీనివాసులు నాయుడు, కోడూరు నాగిరెడ్డి నియమితులయ్యారు. సీతారామపురం మండలం మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడిగా సోమనబోయిన రాజశేఖర్, సభ్యులుగా పీ రఘురాములు, గొల్లపల్లి భాస్కర్, దుత్తలూరు మండలం నందిపాడు సొసైటీ అధ్యక్షుడిగా మండవ మధు, సభ్యులుగా యర్రంరెడ్డి మాలకొండారెడ్డి, కాకర్ల చెన్నకేశవరెడ్డి, కొండాపురం మండలం గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడిగా కుంకు మోహన్‌రావు, సభ్యులుగా కే రాఘవులు, ఎం స్రవంతి, గరిమెనపెంట సొసైటీ అధ్యక్షుడిగా అల్లిక మధు, సభ్యులుగా వేమిరెడ్డి నరసారెడ్డి, వెలుగోటి కొండయ్యను నియమించారు. కలిగిరి మండలం కుడుములదిన్నె సొసైటీ అధ్యక్షుడిగా బాస్యం నరసింహులు నాయుడు, సభ్యులుగా ఎం మాలకొండారెడ్డి, డబ్బుగుంట మాలకొండయ్య, సిద్ధనకొండూరు సొసైటీ అధ్యక్షుడిగా ఎం కృష్ణజీవిరెడ్డి, సభ్యులుగా ఆర్ కొండపనాయుడు, ఎస్‌కే మౌలాలి, కలిగిరి సొసైటీ అధ్యక్షుడిగా కదిరి రంగారావు, సభ్యులుగా జీ శ్రీనివాసులు, సోము భాస్కర్‌రెడ్డిని నియమించారు. జలదంకి సొసైటీ అధ్యక్షుడిగా కే అప్పల్‌నాయుడు, సభ్యులుగా ఎం మధుసూదన్‌రెడ్డి, షేక్ జానీ నియమితులయ్యారు. కాగా ఉదయగిరి మండలం కొట్టాలపల్లి సొసైటీ అధ్యక్షుడిగా గడ్డం వెంకటేశ్వర్లును నియమించారు. ఈయన పదవీ కాలం అక్టోబరు 30తో ముగుస్తుంది. దుత్తలూరు మండలం కమ్మవారిపల్లి సొసైటీకి సంబంధించి నూతన కమిటీని నియమించలేదు.

దళితులకు దక్కని చోటు

కలిగిరి: కూటమి ప్రభుత్వం పీఏసీఎస్ కమిటీల నియామకంలో దళితులకు మొండిచేయి చూపింది. మండలంలో కలిగిరి, కుడుములదిన్నెపాడు, సిద్ధనకొండూరు సొసైటీలు ఉన్నాయి. పొత్తులో భాగం కలిగిరి పీఏసీఎస్ చైర్మన్ పదవిని ఉదయగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి కదిరి వెంకట రంగారావుకు కేటాయించారు. కుడుములదిన్నెపాడు సొసైటీ చైర్మన్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు బాసం నరసింహులనాయుడు, సిద్ధనకొండూరు సొసైటీ చైర్మన్‌గా మెట్టుకూరు చిరంజీవిరెడ్డి సోదరుడు కృష్ణజీవిరెడ్డిని నియమించారు. మండలంలో 43వేల జనాభా ఉండగా ఎస్సీ, ఎస్టీలు పదివేల మందికి పైగా ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు సముచిత స్థానం కల్పిస్తామని, వారిని అందలం ఎక్కిస్తామని పదేపదే చెప్పే నాయకులు నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో వారిని పట్టించుకోవడం లేదు. మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు సంబంధించి చైర్మన్ పదవి ఇవ్వకపోగ కనీసం సభ్యులుగా కూడా చోటు కల్పించలేదు. మండల టీడీపీలో బలమైన ఎస్సీ నాయకులు కూడా ఉన్నారు. అయినప్పటికీ నామినేటెడ్ పదవుల విషయంలో వారిని పట్టించుకోకపోవడంపై దళిత వర్గాల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.


స్మార్ట్ మీటర్లతో తీరని నష్టం



విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్న సీపీఎం నాయకులు

జలదంకి: పాతమీటర్ల స్థానంలో ఏర్పాటు చేస్తున్న ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు తీరని నష్టం కలుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి అన్నారు. స్మార్ట్ మీటర్లను రదుద చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు జలదంకిలోని ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని, వాటిని బిగిస్తే అడ్డుకుని పగులకొట్టాలని పిలుపునిచ్చిన మంత్రి లోకేశ్ ఇప్పుడు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ట్రూఆఫ్ చార్జీలపై ఇష్టానుసారంగా కరెంటు చార్జీలు పెంచుతూ పోతోందన్నారు. వినియోగదారులపై భారాన్ని తగ్గించపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయకపోతే ప్రజల దండనకు ప్రభుత్వం గురికావాల్సి వస్తుందన్నారు. నాయకులు రావి మాల్యాద్రి, గడ్డం విజయలక్ష్మి, గడ్డం మాల్యాద్రిరెడ్డి, ఆంతోనీబాబు, చింతం వెంకటేశ్వరరెడ్డి, మూగ శ్రీనివాసులు, కొండారెడ్డి, గోపసాని మాల్యాద్రి, దేవరకొండ బాలయ్య, సాగర్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ వైద్యశాలల్లో తనిఖీలు



ప్రవీణ్ ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఎంహెచ్‌ఓ బ్రిజిత

కావలి (జలదంకి): కావలిలోని ప్రైవేట్ వైద్యశాలలను ఏడీఎంహెచ్‌ఓ బ్రిజిత సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రవీణ్, లైఫ్‌కేర్, లత తల్లిపిల్లల., రవికాంత్, లక్ష్మీనారాయణ ఆస్పత్రులతో పాటు ఎస్‌వీ ల్యాబ్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహించే వారు ఏపీ అల్లోపతి క్లినికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2002 కింద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, లేకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పొల్యూషన్, ఫైర్‌సేఫ్టీ, బయోమెడికల్ వేస్టేజ్, ఆస్పత్రుల్లో అందిస్తున్న సేవలు, వైద్యుల వివరాలు, వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను తెలియజేసే బోర్డులను ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డాక్టర్ వెంకటలక్ష్మి, గైనకాలజిస్ట్ మేఘనాథ్, డిప్యూటీ సహాయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులపై అవగాహన

ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి రైతుసేవా కేంద్రంలో నెల్లూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో సమగ్ర సస్యరక్షణ యాజమాన్య పద్ధతులపై రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. డీఆర్సీ ఏడీఏ మారుతీదేవి జీవన ఎరువులు, సమతుల ఎరువుల వాడకం, అధిక మోతాదులో యూరియా వాడకంతో కలిగే అనర్థాలు, సమగ్ర సస్యరక్షణ చర్యలు, ట్రైకోడెర్మావిరిడి వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ విజయభాస్కర్, వీఏఏ వెంకటపతి, రైతులు పాల్గొన్నారు.

సీతారామపురం : రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం టెక్నికల్ ఏఓ రామ్మోహన్ అన్నారు. బసినేనిపల్లిలో సోమవారం రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం, సూక్ష్మ పోషకాల లోపాలు, నివారణ చర్యలు, సేంద్రియ ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్ట విత్తనాల ఉపయోగం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఓ చెన్నారెడ్డి, ఏఈఓ సుధీర్‌కుమార్, వీఏఏ భరత్, రైతులు పాల్గొన్నారు.